


## ఉయ్యాలవాడ కింగ్ మేకర్ 'హనుమ'

- ఒంటి చేతితో గెలిపించిన దురంధరుడు
- సాఫీగా సజావుగా సాగిన సర్పంచ్ ఎన్నికలు
- ఊపిరి పీల్చుకున్న అధికారులు


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 019
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
డిసెంబర్ 23, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# 20 రోజుల ముందే.. పనులు పూర్తి





- రేయింబవళ్లు పనుల జాతర
- చిత్తశుద్ధితో పనిచేస్తున్న అధికారులు
- జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మంత్రి సీతక్కతో కలిసి మేడారం పనుల పర్యవేక్షణ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులను జాతరకు 20 రోజుల ముందుగానే పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రేయింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అనుకున్న సమయం, అనుకున్న లైన్ లో 100శాతం నాణ్యతతో పనులు పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. మరో రెండు వందల సంవత్సరాల వరకు చరిత్ర చెక్కుచెదరకుండా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో పనులు చేపట్టి వడివడిగా పూర్తి చేస్తున్నామన్నారు. అయినా కొందరు కారుకూతలు కూస్తున్నారంటూ పొంగులేటి మండిపడ్డారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్. తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయంనకు హెలికాప్టర్ లో చేరుకున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడికి పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. – వరంగల్ వాయిస్, ములుగు

వివరాలు 2లో..



## మేడారంలో రేపు దర్శనాలు బంద్

మేడారంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గోవిందరాజు, పగిడిద్దరాజు మండపాల ప్రతిష్టాపన ఉన్నందున సమ్మక్క, సారలమ్మ దర్శనాలను నిలిపివేస్తున్నట్లు పూజారుల సంఘం అధ్యక్షుడు, ప్రధాన పూజారి సిద్ధబోయిన జగ్గారావు తెలిపారు. మంగళవారం గద్దెల ఆవరణలో ఆయన మాట్లాడారు. గోవిందరాజు, పగిడిద్ద రాజుల గద్దెల ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో పాటు గద్దెల విస్తరణ పనులు సాగుతున్నట్లు వెల్లడించారు. దీంతో ఒక్కరోజు అమ్మవార్ల దర్శనాలు నిలిపివేస్తున్నామని, ఇందుకు భక్తులు సహకరించాలని ఆయన కోరారు. గురువారం నుంచి తిరిగి దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

## సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

8లో..





## క్రీస్తు బోధనలు మార్గదర్శకం

□ చర్చ్ ల లైటింగ్, పెయింటింగ్ లకు రూ.45 లక్షలు కేటాయింపు
□ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
□ ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు







# 20 రోజుల ముందే.. పనులు పూర్తి

- పెండింగ్‌లో 20 శాతం మాత్రమే
- రేయింబవళ్లు పనుల జాతర
- చిత్తశుద్ధితో పనిచేస్తున్న అధికారులు
- జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- మంత్రి సీతక్కతో కలిసి మేడారం పనుల పర్యవేక్షణ

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ మహా జాతర అభివృద్ధి పనులను రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. గద్దెల ప్రాంగణంలో జరుగుతున్న గ్రానైట్ పనులతోపాటు పగడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల నిర్వహణ పనులను పరిశీలించారు. శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంతో పాటు మేడారంలోని చిలుకలగుట్ట రోడ్డు, స్తూపం, కన్నెపల్లి, జంపన్నవాగు, ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం జాతరలో జరుగుతున్న వివిధ ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

## 80 శాతం పనులు పూర్తి..

మరో రెండు వందల సంవత్సరాల పాటు చరిత్ర చెక్కు చెదరకుండా ఉండాలన్న సంకల్పంతో రాతి కట్టడాలు నిర్మిస్తున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన పనులను మరో పదిహేను రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. చిన్నచిన్న అవంతరాలు వచ్చినా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అనుకున్న సమయంలో పనులు పూర్తి అయ్యేలా కృషి చేస్తున్నారన్నారు. సాంకేతిక పరంగా ఇబ్బందులు ఏర్పడినప్పటికీ మన నిపుణులతోపాటు పక్క రాష్ట్రాల వారి సహకారం కూడా తీసుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. అమ్మల కృపతో పనులు సాఫీగా సాగుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

## కారు కూతలు కూస్తున్నారు..

పనులను 100 రోజుల్లో పూర్తి చేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నా కొందరు కారు కూతలు కూస్తున్నారంటూ మంత్రి పొంగులేటి మండిపడ్డారు. అయినప్పటికీ అమ్మల ఆశీస్సులతో ఎక్కడా పనులకు ఆటంకం కలగలేదన్నారు. మంత్రి సీతక్క నిత్యం పనులను పర్యవేక్షించడం అభినందనీయమన్నారు. అమ్మల కృపా కటాక్షాలు అందరికీ ఉంటాయన్నారు.

## ‘స్వస్తిక్ ’పై రాద్ధాంతం వద్దు..

చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆదివాసుల ఆచారాలు, సాంప్రదాయాలు, విశ్వాసాలకు అనుగుణంగా యజ్ఞంలా పనిచేస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాతి శిలల మీద గిరిజనుల ఆచారాలు, గొట్టు, గొత్రం చెక్కడం హర్షనీయమన్నారు. ‘స్వస్తిక్ ’పై కొందరు రాద్ధాంతం చేయడం తగదన్నారు. ప్రకృతే దైవంగా బతుకున్నాం కాబట్టి స్వస్తిక్ అలా చెక్కబడిందని వివరించారు. దీనిపై ఎలాంటి రాద్ధాంతం లేదు. ఆదివాసీలు ప్రకృతి సిద్ధాంతానికి అనుగుణంగా వ్యవహరిస్తారన్నారు. తాళపత్ర గ్రంథాలు, పూజారుల అభిప్రాయాల మేరకే ఆచార వ్యవహారాలకు భంగం వాటిల్లకుండా రాతి శిలలను ఏర్పాటు చేశామన్నారు. తల్లుల ఔనత్యం ఉట్టిపడేలా  నిర్మాణాలు చేస్తున్నందున రెండు తెలుగు రాష్ట్రాల భక్తులే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న గిరిజనులు, ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జాతరను విజయవంతం చేయాలని సీతక్క కోరారు.

## అధికారులతో సమీక్ష..

అనంతరం అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు పూర్తయిన పనులు, పర్యవేక్షన రానున్న రోజుల్లో ప్రణాళిక తదితర అంశాలపై అధికారులు వివరించారు. ఇప్పటి వరకు సాగుతున్న పనులు, రానున్న రోజుల్లో చేపట్టనున్న పనులపై చర్చించారు. జాతర నాటికి పనులు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జాతర నేపథ్యంలో ఇప్పటికే భక్తుల తాకిడి పెరిగిందని, రానున్న రోజుల్లో ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా భక్తుల దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.











# ప్రభుత్వ భూముల వేలం ఆపాలి

◆ అక్రమ లీజులు రద్దు చేయాలి

◆ వామపక్ష నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వం, కుడా, నగరపాలక సంస్థ నిర్ణయాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పలువురు వామపక్ష నాయకులు మాట్లాడారు. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర పరిపాలన ఖర్చుల కోసం ప్రభుత్వ ఆస్తులను అమ్మడం దారుణమని వారు మండిపడ్డారు. నగరానికి గుండెకాయ వంటి బస్టాండ్ సమీపంలోని సర్వే నంబర్ 1066 భూమిని వేలం వేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలు, పౌర సంఘాల వ్యతిరేకతతో తాత్కాలికంగా వేలం ఆపినప్పటికీ, ఆ భూమిపై ప్రభుత్వం కన్నేయడం సరికాదన్నారు. నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలే తప్ప, భావితరాలకు ఉపయోగపడే భూములను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయొద్దని హెచ్చరించారు. అనేక ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు నేటికీ అద్దె భవనాల్లో ఉన్నాయని, భవిష్యత్తులో వాటి సొంత భవనాల కోసం భూమి ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలుకుబడి కలిగిన ప్రజాప్రతినిధులు, ధనవంతులు నామమాత్రపు ధరకే విలువైన భూములను లీజుకు తీసుకున్నారని, అవి లీజుల పేరుతో జరిగిన కబ్జాలేనని నాయకులు ఆరోపించారు. ఆ లీజులన్నింటిపై సమగ్ర విచారణ జరిపి, అక్రమమని తేలితే తక్షణమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. నగరవ్యాప్తంగా ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి, వాటి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆక్రమణలో ఉన్న భూములను వెలికితీసి స్వాధీనం చేసుకోవాలి. ప్రభుత్వ భూములను ప్రజా అవసరాలకు లేదా నిరుపేదలకే కేటాయించాలి. త్వరలోనే భూముల రక్షణ కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, కార్యాచరణను ప్రకటిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, సీపీఐ నేతలు ఏదునూరి వెంకట్రాజం, మద్దెల ఎల్లేష్, కొట్టెపాక రవి, సీపీఎం నేతలు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, గొడుగు వెంకట్, ఎంసీపీఐ(యూ) కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు నున్నా అప్పారావు, భారత్ బచావో నేత దొమ్మాటి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్లు కొలువు చేస్తే.. చివరకు రోడ్డున పడేశారు!

◆ బులియన్ మర్చంట్ యజమాని వేధింపులపై గుమాస్తా ఆవేదన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రెండు దశాబ్దాల పాటు నమ్మకంగా పనిచేసినా, కారణం లేకుండా ఉద్యోగం నుంచి తొలగించి, సర్వీసు ప్రయోజనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని వరంగల్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ పరిధిలోని ఒక షాపు గుమాస్తా శెట్టి సంతోష్ కుమార్ కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం ఆయన తన గోడును మీడియా ముందు వెళ్లగక్కారు. సంతోష్ కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండలోని రత్నా జ్యువెలర్స్ యజమాని గుడిమల్ల సాంబశివరావు వద్ద 2005 నుంచి సుమారు 20 ఏళ్లుగా గుమాస్తాగా పని చేస్తున్నారు. అయితే, నవంబర్ 2025లో యజమాని ఎటువంటి కారణం లేకుండా తనను ఉద్యోగంలో నుంచి తొలగించారని ఆరోపించారు. ఇన్నేళ్ల సేవలకు గాను రావాల్సిన సర్వీస్ బోనస్, లీవ్ సాలరీ అడిగితే.. యజమాని బూతులు తిడుతూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబాన్ని పోషించుకోవడానికి ఇతర దుకాణాల్లో పనికి వెళ్తుంటే, అక్కడ కూడా యజమాని సాంబశివరావు అబద్ధపు ప్రచారాలు చేస్తూ తన పొట్ట కొడుతున్నారని సంతోష్ కుమార్ వాపోయారు. షాపులో పనిచేసినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికే వరంగల్ జిల్లా కలెక్టర్, డీఎల్ఐ, ఏసీఎల్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదని సంతోష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సామాన్య కార్మికుడిపై కక్ష కట్టి, కుటుంబాన్ని వీధిన పడేసిన యజమానిపై లేబర్ డిపార్ట్మెంట్ కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు రావాల్సిన సర్వీస్ ప్రయోజనాలు అందేలా చూడాలని ఆయన అధికారులను వేడుకున్నారు. లేనిపక్షంలో తన కుటుంబంతో కలిసి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

# ఉపాధి హామీని నీరుగార్చేందుకే కేంద్ర నూతన చట్టం

■ 'వికసిత్ భారత్' పేరుతో పేదల పొట్ట కొట్టొద్దు

■ వామపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రామీణ పేదలకు కొంగుబంగారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని వామపక్ష పార్టీల నాయకులు మండిపడ్డారు. కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ రోజుగార్ అజీవిక మిషన్ గ్రామీణ్' చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ఎంసీపీఐ(యూ), సీపీఐ, సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నూతన చట్ట ప్రతులను దగ్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్ మాట్లాడారు. రాజ్యాంగంలోని 41వ అధికరణ ప్రకారం సంక్రమించిన ఉపాధి హక్కును కేంద్రం కాలరాస్తోందని ధ్వజమెత్తారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టం గత 20 ఏళ్లుగా కోట్లాది మంది పేదలకు జీవన భృతిని కల్పిస్తోందని గుర్తు చేశారు. గతంలో కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చేదని, ఇప్పుడు దానిని 60 శాతానికి తగ్గించి, మిగతా 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై నెట్టడం అన్యాయమని అన్నారు. 100 రోజుల పని దినాలను 200 రోజులకు పెంచాలని పేదలు కోరుతుంటే, ఉన్న చట్టాన్ని ఆంక్షలతో నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. పని దినాలను నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వాలు తమ గుప్పిట్లో ఉంచుకోవడం అంటే పేదల హక్కులను హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నియంతృత్వ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలోత్ సాగర్, నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, మహమ్మద్ మెహబూబ్ భాష, జన్ను రవి, చిట్యాల సువర్ణ పాల్గొన్నారు.

# నూతన సర్పంచులకు ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ పంచాయతీ సర్పంచులను సర్దార్ సర్వాయి పాపన్న గౌడ పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లాలోని పలువురు సర్పంచులను సంఘం సభ్యులు శాలువాలు, పూలమాలలతో గౌరవించారు. కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్, బావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్, జయగిరి సర్పంచ్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ లను ఘనంగా సన్మానించారు. తమ సామాజిక వర్గం నుంచి సర్పంచులుగా ఎన్నికై బాధ్యతలు చేపట్టడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ పరపతి సంఘం అధ్యక్షులు అంబాల సూర్యనారాయణ గౌడ్, కోశాధికారి గట్టు సత్యనారాయణ గౌడ్, డైరెక్టర్లు బత్తిని రమేష్ గౌడ్, కంకటి సాగర్ గౌడ్, సభ్యులు పెరుమాండ్ల వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



**వరంగల్ వాయిస్, చిట్యాల:** నేటి విద్యార్థులు రేపటి పౌరులని, వారు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ చిట్యాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యార్థం వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన బీరవోలు వేణుగోపాల రెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేసిన వేణుగోపాల రెడ్డి కుటుంబ సభ్యులను అభినందించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా పుట్టిన గడ్డను, చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమన్నారు. దాతల సహకారం విద్యార్థులకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరళాదేవి, సదయ్య, ఉస్మాన్ అలీ, కూచనపల్లి శ్రీనివాస్, రాం నారాయణ, సుజాత, శంకర్, బుజ్జమ్మలతో పాటు వార్డు మెంబర్ తౌటం నవీన్, గ్రామస్తులు మేడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ, కరుణల ప్రతిరూపం.. క్రిస్మస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** క్రిస్మస్ పర్వదినం కేవలం ఒక మతానికి చెందిన పండుగ మాత్రమే కాదు, అది ప్రపంచవ్యాప్తంగా ప్రేమ, క్షమ, నిస్వార్థ సేవ అనే గొప్ప విలువలను గుర్తుచేసే మహత్తర దినం. లోక రక్షకుడైన యేసుక్రీస్తు బోధనలు మతాలకు అతీతంగా మానవాళికి దిశానిర్దేశం చేస్తాయి. "పొరుగువారిని ప్రేమించు.. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనందించు" అనే ఆయన సందేశం సర్వకాలీనమైనది, సర్వమత ఐక్యతకు ప్రతీక అని ప్రముఖ సామాజివేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల ఆరాధ్య దైవం శాంటా క్లాస్. శాంటా కేవలం బహుమతులు ఇచ్చే వ్యక్తి మాత్రమే కాదు, త్యాగం, దానం, ఆనందాన్ని పంచుకోవాలనే భావనకు ఆయన ఒక ప్రతిరూపం. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తూనే, పెద్దల మనసుల్లో మానవత్వాన్ని మేల్కొల్పడం శాంటా ఇచ్చే ప్రధాన సందేశం. మతం ఏదైనా, భాష ఏదైనా, మనుషులమంతా ఒక్కటే అన్న భావన క్రిస్మస్‌లో కనిపిస్తుంది. ద్వేషాన్ని దూరం చేస్తుంది. సమాజంలో వెలుగులు నింపుతుంది, శాంతియుత ప్రపంచాన్ని నిర్మిస్తుందన్నారు. యేసుక్రీస్తు జన్మించిన ఈ పవిత్ర దినం సందర్భంగా మనమందరం ద్వేషాన్ని వీడి ప్రేమతో మెలుగుదామని నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## దేశ ఆర్థిక ప్రదాత పీవీకి ఘన నివాళులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పీవీ నరసింహారావు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వీ.శ్రీనివాస్ రావు కొనియాడారు. మంగళవారం పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. విప్లవాత్మకమైన ఆర్థిక సంస్కరణలతో భారతదేశ గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన ధీశాలి పీవీ అని కొనియాడారు. సాహసోపేతమైన నిర్ణయాలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించి, నేడు భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడానికి బలమైన పునాదులు వేశారని గుర్తుచేశారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, బహుభాషా కోవిదుడిగా, తెలంగాణ బిడ్డగా దేశ ప్రధాని స్థాయికి ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచిన మహనీయుడని ఆయన అన్నారు. నేటి తరం నాయకులు పీవీ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, టీపీసీసీ మాజీ కార్యదర్శి బొమ్మనపల్లి అశోక్ రెడ్డితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పీవీకి నివాళులు అర్పించారు.

## బీసీ మహిళలకు కారు డ్రైవింగ్ శిక్షణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీసీ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు వీలుగా ఓబీసీ హనుమకొండ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కారు డ్రైవింగ్ (మహిళా కార్ పైలెట్) శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంస్థ చైర్మన్, మాజీ 'కూడా'చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ తెలిపారు. ఉత్సాహవంతులైన బీసీ మహిళలు, బాలికలకు డ్రైవింగ్ నేర్పించి వారికి ఉపాధి మార్గం చూపడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అర్హులైన మహిళలు తమ తల్లిదండ్రుల సమ్మతితో, నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తులను నింపి హన్మకొండ రాంనగర్‌లోని ఓబీసీ కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఓబీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం భాస్కర్ మాట్లాడుతూ.. గతంలో బీసీ బాలికల వసతి గృహాల్లో నిర్వహించిన ఆరోగ్య శిబిరాలు ఏ విధంగా విజయవంతమయ్యాయో, అదే రీతిలో ఈ ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి. తల్లిదండ్రుల అంగీకార పత్రం తప్పనిసరి. హన్మకొండ రాంనగర్ ఆఫీసులో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. ఈ ఉత్కృష్టమైన కార్యక్రమానికి జిల్లాలోని బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 'అగ్రంపాడు' జాతర పనులకు అంకురార్పణ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన ఆత్మకూరు మండలం అగ్రంపాడు సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. జాతర ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జాతర ప్రాంగణంలో పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, సీఐ ఆర్. సంతోష్, స్థానిక సర్పంచ్ మహేందర్, జాతర పూజారులు కలిసి జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. క్యూలైన్లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనులను పర్యవేక్షించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. మాజీ చైర్మన్ బోరిగం స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు ఏలియా అధికారులకు పలు సూచనలు చేశారు.

# మహోన్నత మేధావి పీవీ నరసింహారావు

◆ నివాళులర్పించిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** భారతదేశ గతిని మార్చిన మహోన్నత మేధావి, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పీవీ నరసింహారావు దేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన దార్శనిక నాయకుడని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. మంగళవారం పీవీ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని, ఆర్థిక స్థిరత్వాన్ని చేకూర్చిన అపూర్వ మేధావి పీవీ అని శ్లాఘించారు. బహుభాషా కోవిదుడిగా, భారతీయ సంస్కృతిపై గాఢమైన పట్టున్న నేతగా ఆయన పరిపాలన ప్రపంచానికే ఆదర్శమన్నారు. తెలంగాణ గడ్డపై పుట్టి, దేశ ప్రధాని స్థాయికి ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశ ప్రతిష్టను పెంచిన మహనీయుడని ఎమ్మెల్యే గుర్తుచేశారు. నేటి యువత పీవీ జీవితం నుంచి క్రమశిక్షణ, సహనం,దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని పీవీ నర్సింహారావుకి ఘనంగా నివాళులు అర్పించారు.

## దేశ ఆర్థిక వ్యవస్థకు పీవీ దిశానిర్దేశం

### కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో సారథ్యం వహించి, తనదైన ముద్ర వేసిన మహానేత, భారతరత్న పీవీ.నరసింహారావు అని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు 23వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం విశ్వవిద్యాలయ హ్యుమానిటీస్ భవనంలోని పొలిటికల్ సైన్స్ విభాగ సెమినార్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై, పీవీ.చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ.. విప్లవాత్మకమైన ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని అగ్రపథాన నిలిపిన అపర చాణక్యుడు పీవీ అని శ్లాఘించారు. ఆయన అమలు చేసిన దీర్ఘకాలిక ప్రణాళికలే నేటి బలమైన భారత ఆర్థిక వ్యవస్థకు పునాదులని పేర్కొన్నారు. బహుభాషా కోవిదుడిగా, మేధావిగా ఆయన కీర్తి అజరామరమని, విద్యార్థులు, యువత ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయ పీవీ. నాలెడ్జ్ సెంటర్ సంచాలకులు డాక్టర్ జి.కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రసంగిస్తూ.. తెలంగాణ మట్టి బిడ్డగా దేశ ప్రధాని స్థాయికి ఎదిగి, విశ్వవ్యాప్త గుర్తింపు పొందిన పీవీ.సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకేనేని వెంకట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర:** గ్రామ పంచాయతీలకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలు రాజకీయాలకు అతీతంగా, ఐక్యతతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవలే జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన దామెర మండలం ఒగ్లాపూర్, ముస్త్యాలపల్లి గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు సభ్యులు మంగళవారం హనుమకొండలోని చల్లా నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు, నిధుల వినియోగం వల్ల తెలంగాణ గ్రామ పంచాయతీలు యావత్ దేశానికే దిక్సూచిగా నిలిచాయన్నారు. పల్లె ప్రగతి ద్వారా జరిగిన అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకుని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ, ఎన్నికైన ప్రతినిధులను మాజీ ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తమపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం నాయకులు,ఆయా గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పీవీ చలవే

▪ తెలంగాణ రైల్వే జేఏసీ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ, భారతరత్న పీవీ.నరసింహారావు 21వ వర్ధంతి సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై పీవీ.చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్ మాట్లాడుతూ.. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పీవీ, కుంటుపడిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారని కొనియాడారు. కేవలం ఆరు నెలల్లోనే దేశ జీడీపీని 3.2% నుంచి 6.5% కి పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు మాట్లాడుతూ.. 1980వ దశకంలో హనుమకొండ ఎంపీగా ఉన్న సమయంలోనే పి.వి. కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయించారని గుర్తు చేశారు. అయితే 1984 ఎన్నికల తర్వాత రాజకీయ కారణాలతో అది పంజాబ్‌కు తరలిపోయిందని, ఆయన ఆశయ సాధన కోసమే జేఏసీ పోరాడి మళ్ళీ ఇప్పుడు కోచ్ ఫ్యాక్టరీని సాధించుకుందని తెలిపారు. ఇది పీవీ ఆత్మకు శాంతి చేకూర్చే పరిణామమని ఆయన పేర్కొన్నారు. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ.. మైనారిటీ ప్రభుత్వం నడుపుతున్నప్పటికీ దేశ భద్రత విషయంలో పి.వి. ఎప్పుడూ రాజీపడలేదన్నారు. అణు పరీక్షలు నిర్వహించి భారత రక్షణ వ్యవస్థ సత్తాను ప్రపంచానికి చాటారని, హైదరాబాద్ విముక్తి పోరాటంలోనూ ఆయనది కీలక పాత్ర అని కొనియాడారు. అనంతరం పీవీ.నరసింహారావుకి గుర్తుగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల నాయకులు గుర్రపు సుధాకర్ రావు, కందుల సంగమయ్య, డి.రవీందర్, పి.రమేష్, జి.భాస్కర్, యాదగిరి, జాఫర్, శిరుమల్ల రమేష్ కుమార్, ఎం.మహేష్, ఎస్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవం మతం కాదు.. ఒక జీవన మార్గం

**• ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్:** "క్రైస్తవం అంటే కేవలం ఒక మతం మాత్రమే కాదు, అది ఒక ఉన్నతమైన జీవన విధానాన్ని నేర్పే మార్గం" అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కే.ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ విందు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు, పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరీసోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను రాష్ట్ర పండుగలుగా అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సంప్రదాయం సమాజంలో మత సామరస్యాన్ని కాపాడటానికి, విద్వేషాలను తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని, ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, క్షమాగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ప్రార్థనా మందిరాలకు వచ్చే విశ్వాసులకు క్రైస్తవ మత పెద్దలు కొన్ని కీలక అంశాలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పిల్లలను తప్పనిసరిగా చదివించాలని, ఏ సమస్యకైనా విద్యే పరిష్కారం చూపుతుందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు, మద్యపానానికి బానిస కాకుండా పాస్టర్లు తమ సందేశాల ద్వారా చైతన్యపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల్లో ఆర్డీఓ వెంకన్న, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పెద్ద సంఖ్యలో పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు, సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం



**వరంగల్ వాయిస్, గణపురం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామ నూతన పాలకవర్గాన్ని మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నూతనంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన బుద్ధారం గ్రామ సర్పంచ్ విడిది లేని శ్రీలత అశోక్, ఉప సర్పంచ్ మారవేణి ఐలయ్యలను సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారితో పాటు వార్డు సభ్యులు లాదల్ల భిక్షపతి, గడ్డం శోభ భిక్షపతి, చేగొండ భాగ్యలక్ష్మి సాంబయ్య, కొవ్వూరి స్వప్న కిరణ్, అచ్చునూరి రజిత సంపత్, బుస రామచంద్ర మూర్తి, ఊరడి మురళిలను ప్రత్యేకంగా అభినందిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా శనిగరపు రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలోని అణగారిన వర్గాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వివక్ష లేని పాలన అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంబేద్కర్ వాదులు గడ్డం సదయ్య, దూడపాక శ్రీనివాస్, ఎడ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు సకాలంలో చెల్లించాలి

**కార్పొరేటర్ మరుపల్ల రవి**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి యజమానులు తమ ఆస్తి పన్ను, నల్లా పన్ను, చెత్త పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్నులను సకాలంలో చెల్లించి మహానగర పాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఉర్సు డీకే నగర్‌లో వార్డ్ ఆఫీసర్ నోటంకి ప్రవీణ్, బిల్ కలెక్టర్ రాజ్ కుమార్లతో కలిసి ఆయన ఇంటి యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో పేరుకుపోయిన పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆర్థిక వెసులుబాటు కోసం రెండు దఫాలుగానైనా చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. మనం చెల్లించే పన్నులే నగరాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన వివరించారు. డివిజన్ నుండి పూర్తిస్థాయిలో పన్నులు వసూలైతే, ప్రభుత్వం నుండి మన డివిజన్‌కు మరిన్ని నిధులు కేటాయించే అవకాశం ఉంటుందని, తద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టవచ్చని పేర్కొన్నారు. డీకే నగర్ కాలనీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పన్నులు చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీకే నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కుండె రాజు, కార్యదర్శి పోలె పాక మల్లేశం, సభ్యులు రమేష్, కాలనీ ఇంటి యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రోచర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కే.యూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబిలీ (స్వర్ణోత్సవ) సంవత్సర వేడుకలలో భాగంగా సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు డీన్ ఆచార్య బి.సురేష్ లాల్ తెలిపారు. "ఇంటిగ్రాటింగ్ ఎస్.డీ.జే.ఎస్ ఫర్ వికసిత్ భారత్ 2047: అచీవ్‌మెంట్స్ అండ్ పాత్‌వేస్" అనే ఇతివృత్తంతో ఈ సదస్సు జరగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ జాతీయ సదస్సు ఫిబ్రవరి 26, 27 తేదీల్లో యూనివర్సిటీ ఆడిటోరియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. దేశాభివృద్ధిలో సుస్థిర లక్ష్యాల పాత్ర, వికసిత్ భారత్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, అవకాశాలపై ఈ సదస్సులో లోతైన చర్చ జరగనుంది. ఈ సదస్సులో పాల్గొనదలచిన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, మేధావులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించాలని ఆచార్య సురేష్ లాల్ కోరారు. సదస్సు రిజిస్ట్రేషన్, పత్రాల సమర్పణ గడువు మరియు ఇతర పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.kaka-tiya.ac.in ను సందర్శించవచ్చని సూచించారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య టి.మనోహర్, ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఎం.స్వర్ణలత, డాక్టర్ బి.రాధికా రాణి, డాక్టర్ ఆర్.మేఘనా రావు, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ సంకేనేని వెంకట్, డాక్టర్ సీహెచ్.రాజ్ కుమార్, డాక్టర్ ఎం.లింగయ్య పాల్గొన్నారు

# 1195 జీవోను తక్షణమే అమలు చేయాలి

**ప్రభుత్వానికి రామ రాజేష్ ఖన్నా విజ్ఞప్తి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రయోజనం కోసం ప్రభుత్వం జారీ చేసిన 1195 జీవోను తక్షణమే అమలు చేయాలని ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో విడుదల చేసి ఆరు నెలలు గడుస్తున్నా, నేటికీ క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు పెరిగిన వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. పెరిగిన ధరల దృష్ట్యా వేతన జీవులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి పెరిగిన వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ జీవో అమలుపై కొంతమంది ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉందని రాజేష్ ఖన్నా తెలిపారు. అయితే, ఈ సాంకేతిక కారణాలను సాకుగా చూపకుండా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా లేదా కోర్టు ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలాది మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ టోర్నీకి 'కేయూ' జట్టు ఎంపిక



**వరంగల్ వాయిస్, కే.యూ క్యాంపస్:** తమిళనాడులోని చెన్నైలో గల ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ బాస్కెట్ బాల్ (పురుషుల) టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కాకతీయ విశ్వవిద్యాలయ జట్టు ఎంపికైంది. ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగే ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో కేయూ తరపున పాల్గొనే క్రీడాకారుల వివరాలను విశ్వవిద్యాలయ క్రీడా విభాగం వెల్లడించింది. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో ప్రతిభ కనబరిచిన కింది క్రీడాకారులు కేయూ జట్టులో స్థానం సంపాదించుకున్నారు. కేయూ వ్యాయామ కళాశాల సీహెచ్ జయచంద్ర, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (హనుమకొండ) కే.భరత్ రాజ్, వాగ్దేవి డిగ్రీ కళాశాల కే.యశ్వంత్, కే.సుధాకర్, విఘ్నేశ్, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల జి.దినేష్ కుమార్, టి.మాయార్ రాజ్, ఎస్.తారకేష్ యాదవ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (హనుమకొండ) ఎం.శ్రీహరి, బి.ఈశ్వర్, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ (ఖమ్మం) ఆర్. నరేందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మహబూబాబాద్) పి.అవినాష్ లు ఎంపికయ్యారు. ఈ జట్టుకు కోచ్‌గా హనుమకొండ గీతాంజలి డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఇర్ఫాన్ మహమ్మద్, మేనేజర్‌గా విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.భాస్కర్ వ్యవహరించనున్నారు.

# మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

**◆ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య**



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మహిళలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం ప్రతి మంగళవారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ' క్లినిక్ సేవలను వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న క్లినిక్ పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన మహిళలతో డాక్టర్ అప్పయ్య నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ (రొమ్ము క్యాన్సర్), గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక దశలోనే వీటిని గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చని అవగాహన కల్పించారు. ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ ఏడాది ఇప్పటివరకు ఆత్మకూరు పీహెచ్‌సీలో 1560 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించగా, అందులో 350 మందికి లోతైన వైద్య పరీక్షలు చేశారని, 82 మందిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేశారని డీఎంహెచ్ఓ తెలిపారు. రిఫర్ చేసిన ప్రతి రోగికి తగిన ఫాలోఅప్ సేవలు అందించాలని, వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని వైద్యాధికారి డాక్టర్ స్పందనను ఆదేశించారు.ప్రస్తుతం కొనసాగుతున్న లేప్రసీ (కుష్టు వ్యాధి) కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నప్పుడు శరీరపై స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి, వెంటనే వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ స్పందన, డాక్టర్ పుష్పలీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, డిసెంబర్ 23, 2025

## ఓదెల సంపత్ కుమార్‌కు సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా దశాబ్దాల పాటు విద్యారంగంలో విశేష సేవలందించిన ఓదెల సంపత్ కుమార్ (సోషల్ స్కూల్ అసిస్టెంట్) సేవలు అభినందనీయమని పలువురు విద్యావేత్తలు కొనియాడారు. గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ, వచ్చే జనవరి నెలలో ఉద్యోగ విరమణ పొందనున్న సంపత్ కుమార్‌ను వరంగల్, ఖిలా వరంగల్ మండలాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు మంగళవారం సాయంత్రం ఉర్సు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉర్సు సోషల్ కాంప్లెక్స్ చైర్మన్ పూసారాం, గౌరవాధ్యక్షులు భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సంపత్ కుమార్ తన సుదీర్ఘ సర్వీసులో పాఠాలు బోధించడమే కాకుండా, పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెరుమాండ్ల సాంబమూర్తి, ఎం.భిక్షపతి, కోశాధికారి రంగాచారి, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్. సంపత్, కాంప్లెక్స్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరకాలలో ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు "టీబీ ముక్త్ భారత్" (క్షయ రహిత భారత్) కార్యక్రమంలో భాగంగా పరకాల ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం టీబీ నిర్ధారణ, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా కమలాపురం మండలం శనిగారం గ్రామం నుంచి వచ్చిన ప్రజలకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చవాన్ మాట్లాడుతూ.. గత ఏడు నెలల నుంచి ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 2 నుంచి నేటి వరకు సుమారు 4,002 మందికి ఎక్స్-రేలు, 1,550 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో టీబీ పాజిటివ్‌గా తేలిన 23 మంది రోగులకు అవసరమైన మందులు, టాబ్లెట్స్ ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నిరంతర కృషి ఫలితంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో అంకితభావంతో పనిచేస్తున్న ఎక్స్-రే టెక్నీషియన్ రాసమల్ల కృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రశాంత్ గారిని సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ స్వాతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీకి పురుడుపోసిన '108' సిబ్బంది



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదాతగా నిలుస్తున్న 108 సేవలు మరోసారి తన విశిష్టతను చాటుకున్నాయి. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట వద్ద గల కాలనీలో పురిటి నొప్పులతో విలవిలలాడుతున్న ఓ మహిళకు 108 సిబ్బంది ఇంటి వద్దే సురక్షితంగా డెలివరీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎర్రగట్టుగుట్ట కాలనీకి చెందిన జి.ఝాన్సీ (27)కి మంగళవారం తెల్లవారుజామున తీవ్రమైన పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే హన్మకొండ నుంచి 108 వాహనం హుటాహుటిన ఆమె నివాసానికి చేరుకుంది. అప్పటికే నొప్పులు తీవ్రమవ్వడంతో ఆసుపత్రికి తరలించే సమయం లేదని గుర్తించిన ఈఎంటీ పి.స్వాతి, పైలట్ కొండ తిరుపతి ఇంటి వద్దే ప్రసవం చేయడానికి నిర్ణయించుకున్నారు. సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఝాన్సీకి నార్మల్ డెలివరీ చేయగా, ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటీ స్వాతి తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిద్దరిని హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి (మిషన్ హాస్పిటల్) తరలించారు.

# బినామీల పేర్లతో టోకెన్లు..

- ◆ దళారుల జేబుల్లోకి మద్దతు ధర
- ◆ ఐదేళ్లుగా సాగుతున్న అక్రమ తంతు
- ◆ ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం ఖానాపురం గ్రామ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం అక్రమాలకు అడ్డాగా మారింది. అమాయక రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు దళారులు, ఐకేపీ నిర్వాహకులు కుమ్మక్కై భారీ దోపిడీకి తెరలేపారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ చీకటి దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నట్లు సమాచారం. నిర్వాహకులు తమకు అనుకూలమైన బినామీ వ్యక్తుల పేర్ల మీద టోకెన్లు సృష్టించి, తక్కువ ధరకు సేకరించిన ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల నాలుగు డీసీఎం లోడ్ల ధాన్యాన్ని ఈ విధంగానే తరలించినట్లు సమాచారం. ప్రభుత్వ మద్దతు ధర రైతులకు చేరాల్సిన చోట, అధికారులతో కుదుర్చుకున్న 'చీకటి ఒప్పందాల' వల్ల దళారుల జేబుల్లోకి చేరుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఈ అక్రమ వ్యాపారి చుట్టుపక్కల గ్రామాల్లో ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని, రైతుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నట్లు భోగట్టా. స్థానిక ప్రాథమిక సహకార సంఘం అధికారులు కూడా వీరికి సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐదేళ్లుగా ఇంత పెద్ద ఎత్తున మోసం జరుగుతున్నా క్షేత్రస్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు ముసుగులో జరుగుతున్న ఈ దోపిడీపై జిల్లా కలెక్టర్, డీసీవో, డీఏఓ తదితర ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలని ప్రజలు వేడుకుంటున్నారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిజమైన రైతులకు న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హన్మకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం 59వ డివిజన్ పరిధిలోని కనకదుర్గ కాలనీలో రూ.74.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి పనిలోనూ అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర మౌలిక సదుపాయాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాలనీ నివాసితుల చిరకాల వాంఛ అయిన రోడ్డు వెడల్పు పనులు ప్రారంభం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్ రావు, డివిజన్ కార్పొరేటర్ వసంత, డివిజన్ ఇంచార్జ్ కేతిడి దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కిరణ్, నాయకులు నాగరాజు, సమ్మయ్య, సుదర్శన్ రెడ్డి, సుగుణ, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, కాలనీ నివాసితులు పాల్గొన్నారు

## లేబర్ కోడ్స్ రద్దుకు సంఘటితం కావాలి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ ఏకపక్షంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు విశ్రమించేది లేదని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి హెచ్చరించారు. మంగళవారం హన్మకొండ శాయంపేటలోని నందనార్ గార్డెన్‌లో అడ్డూరి రాజు, అర్షం అశోక్ అధ్యక్షతన జరిగిన వరంగల్ – హన్మకొండ జిల్లాల స్థాయి టీయూసీఐ నిర్మాణ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. కార్మికులను కుల, మతాల పేరుతో విభజిస్తున్న కుటిల రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా కనీస వేతనాల గెజిట్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ పారిశ్రామికవేత్తల శ్రమదోపిడీకి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర వేతన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వరంగల్ – హన్మకొండ జిల్లా కమిటీని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అడ్డూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా అర్షం అశోక్, ఉపాధ్యక్షుడిగా సంగినేని సతీష్, సహాయ కార్యదర్శిగా ఉడుతల సూరయ్య, కోశాధికారిగా గబ్బేట దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా సాబీరీకానీ మోహన్, బెల్లంకొండ కర్ణాకర్, ఉసిల్ల రాజయ్య, బానోతు లాలు, బొట్టు వెంకన్న, బొమ్మకంటి యుగేందర్, నక్క మల్లేశం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు తదితరులు ప్రసంగించారు. సమావేశం ముగింపులో పలు ప్రజా, కార్మిక సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు.

## క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

■ ఎంఈఓ లక్ష్మా నాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** "క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది" అని డోర్నకల్ మండల విద్యాశాఖాధికారి అంగోత్ లక్ష్మా నాయక్ పేర్కొన్నారు. డోర్నకల్ పట్టణంలోని సెయింట్ ఆగ్నెస్ హైస్కూల్ స్థాపించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించి, నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులను పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సన్మానించింది. గ్రామాల అభివృద్ధిలో వీరు కీలక పాత్ర పోషించాలని ఎంఈఓ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పసాలా అంథోని మాట్లాడుతూ.. సెయింట్ ఆగ్నెస్ పాఠశాల అనతి కాలంలోనే డోర్నకల్ ప్రజల ఆదరాభిమానాలను చూరగొందని తెలిపారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో డాక్టర్లు, ఇంజనీర్లుగా, వివిధ ఉన్నత హోదాల్లో రాణిస్తుండటం తమకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఉన్నత స్థితిలో ఉన్న పూర్వ విద్యార్థులను పాఠశాల తరపున ప్రత్యేకంగా సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హెలెన్ రాణి, వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# రోషన్‌కిది అతిపెద్ద ఛాలెంజ్

టీనేజీలో ఉండగానే 'నిర్మలా కాన్వెంట్' అనే చిన్న సినిమా చేశాడు శ్రీకాంత్ తనయుడు రోషన్ మేకా. కానీ ఆ చిత్రం సరిగా ఆడలేదు. చాలా ఏళ్లు గ్యాప్ తీసుకున్న తర్వాత రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో 'పెళ్లిసందడి'లో నటించాడు. ఆ సినిమాకు మిక్స్డ్ టాక్ వచ్చినా.. హీరో హీరోయిన్లు, పాటలు ప్రత్యేక ఆకర్షణగా మారి ఓ మాదిరిగా ఆడింది. ఇటు రోషన్‌కు, అటు శ్రీలీలకు మంచి పేరొచ్చింది. దీంతో ఇద్దరికీ అవకాశాలు వెల్లువెత్తాయి.

'పెళ్ళిసందడి' తర్వాత శ్రీలీల వరుసగా సినిమాలు చేసింది. స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఆమె తర్వాత దాదాపు పది చిత్రాల్లో నటించగా.. రోషన్ మాత్రం చాలా టైం తీసుకుని ఒకే ఒక్క సినిమాలో నటించాడు. అదే.. ఛాంపియన్. పేరొచ్చింది కదా అని ఏ సినిమా పడితే ఆ సినిమా చేయకుండా మంచి చిత్రంతోనే ప్రేక్షకుల ముందుకు రావాలని చూశాడు. వైజయంతీ వారి స్వప్న సినిమాలో 'ఛాంపియన్'తో అతను రీఎంట్రీ ఇస్తున్నాడు.

రోషన్ లాంటి యంగ్ హీరో మీద స్వప్న సినిమా సంస్థ ఏకంగా రూ.45 కోట్ల బడ్జెట్ పెట్టేసింది. నిజాం కాలంలో నడిచే కథ ఇది. నాటి వాతావరణాన్ని తెరపైకి తేవాలంటే బాగా ఖర్చవుతుంది. అయినా కథ మీద నమ్మకంతో ధైర్యంగా అడుగు వేశారు నిర్మాతలు. టీజర్, ట్రైలర్ చూస్తే అంత ఖర్చు పెట్టడం వర్త్ అనే అనిపిస్తోంది. ఈ సినిమాలో కంటెంట్‌ను గుర్తించి ఒక ఓటీటీ సంస్థ రూ.16 కోట్లకు డిజిటల్ రైట్స్ తీసుకుందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ రోజుల్లో ఒక అప్ కమింగ్ హీరో సినిమాకు అంత రేటివ్వడం అనూహ్యమే. మిగతా నాన్ థియేట్రికల్ రైట్స్ ద్వారా నాలుగైదు కోట్లు రావచ్చు.

థియేటర్ల నుంచి రూ.30 కోట్ల దాకా షేర్ రావాల్సి ఉంది. అంటే గ్రాస్ రూ.50 కోట్ల దాకా కలెక్ట్ చేయాలి. రోషన్ రేంజికి ఇది చాలా గట్టి టార్గెట్. పైగా క్రిస్మస్ వీకెండ్లో చాలా సినిమాల నుంచి పోటీ ఉంది. ఈ టార్గెట్ అందుకోవాలంటే సినిమాకు అదిరిపోయే టాక్ రావాలి. జనం కూడా రోషన్ సినిమా చూడడానికి అమితాసక్తిని ప్రదర్శించాలి. మొత్తానికి రోషన్‌కిది అతిపెద్ద ఛాలెంజ్ అవుతుందేమో అనిపిస్తోంది. మరి 'ఛాంపియన్'తో బాక్సాఫీస్ హిట్టు కొట్టి హీరోగా నిలబడడమే కాక నిర్మాతలనూ రోషన్ కాపాడతాడేమో చూడాలి.




# సంక్రాంతి బరిలో శర్వానంద్

## నారీ నారీ నడుమ మురారి

ఈ సంక్రాంతికి బాక్సాఫీస్ పై టాలీవుడ్ హీరోల ముప్పేట దాటి తప్పేలా లేదు. అగ్ర హీరోల నుంచి మీడియం రేంజ్ హీరోల వరకు సంక్రాంతికి తమ సినిమాలని దించుతున్నారు. ఇప్పటికే ప్రభాస్ రాజా సాబ్, చిరంజీవి మన శంకర వరప్రసాద్, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు లాంటి సినిమాలు సంక్రాంతికి బెర్తులు ఖారారు చేసుకున్నాయి. వీరందరితో పాటు శర్వానంద్ కూడా సంక్రాంతి రేసులో మధ్యలో దూరేశాడు.

రామ్ అబ్బరాజు దర్శకత్వంలో శర్వానంద్ నటించిన నారీ నారీ నడుమ మురారి చిత్రం జనవరి 14న రిలీజ్ అవుతోంది. తాజాగా విడుదలైన టీజర్ తో రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేశారు. మరి టీజర్ ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం. ఈ చిత్రంలో శర్వానంద్ కి జోడిగా సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ మొత్తం ఫన్ రైడ్ లా ఉంది. ఇద్దరు అమ్మాయిల మధ్య నలిగిపోయే కుర్రాడిగా శర్వా కనిపిస్తున్నాడు. సంయుక్త మీనన్ అతడి ఎక్స్ లవర్. ఎక్స్ లవర్ పక్కన ఉండగానే మరో అమ్మాయితో ప్రేమాయణం సాగిస్తున్నాడు. ఇలా ట్రైయాంగిల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. కామెడీ పంచ్ డైలాగులు బాగా పేలుతున్నాయి.

**రవితేజ, శర్వానంద్ లలో డ్యామేజ్ ఎవరికి ?**

అయితే ఇక్కడ ఒక పెద్ద రిస్క్ ఉంది. శర్వానంద్ ఏకంగా రవితేజతో పోటీ పడుతుంది. రవితేజ నటిస్తున్న భర్త మహాశయులకు విజ్ఞప్తి చిత్రం కూడా సంక్రాంతికి రిలీజ్ అవుతోంది. ఈ సినిమా థీమ్ కూడా ఇలాగే కనిపిస్తోంది. ఈ చిత్రంలో రవితేజ తన భార్య, లవర్ మధ్య నలిగిపోతుంటే.. నారీ నారీ నడుమ మురారిలో శర్వా ఎక్స్ లవర్, ప్రెజెంట్ లవర్ మధ్య నలిగిపోతున్నాడు. పైగా రెండు సినిమాలు ఒకరోజు గ్యాప్ లో రిలీజ్ అవుతున్నాయి. దీనితో ఎవరి సినిమా ఎవరిని డ్యామేజ్ చేస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది.






# వెయ్యి కోట్ల క్లబ్‌లోకి ధురంధర్

రణ్‌వీర్ సింగ్ హీరోగా, 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. జియో స్టూడియోస్ సమర్పణలో B62 స్టూడియోస్ నిర్మించిన ఈ సినిమా సుమారు రూ.280 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కగా, విడుదలైన నాటి నుంచి అంచనాలను మించి వసూళ్లు సాధిస్తూ బాలీవుడ్ రికార్డులను తిరగరాస్తోంది. డిసెంబర్ 5న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం 17వ రోజు ఆదివారం ఇండియాలో రూ.38.5 కోట్ల వసూళ్లు రాబట్టి మరోసారి తన సత్తా చాటింది. దీంతో మొత్తం ఇండియా కలెక్షన్లు రూ.566.75 కోట్లకు చేరగా, ప్రపంచవ్యాప్తంగా రూ.852.75 కోట్ల గ్రాస్‌ను సాధించి 'యానిమల్' మూవీ రికార్డును బ్రేక్ చేసింది. ముఖ్యంగా అదే రోజు అవతార్ 3 ఇండియాలో రూ.25 కోట్లు మాత్రమే వసూలు చేయగా, 'ధురంధర్' దాన్ని అధిగమించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ ఏడాది భారీ హిట్‌లుగా నిలిచిన 'ఛావా', 'కాంతారా చాప్టర్ 1' వంటి చిత్రాల రికార్డులను కూడా ఒక్కొక్కటిగా బద్దలు కొడుతూ, ఈ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. సినిమాలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అక్షయ్ ఖన్నా, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో నటించడంతో కథకు మరింత బలం చేకూరింది. శక్తివంతమైన కథనం, ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు, ఆదిత్య ధర్ మార్క్ దర్శకత్వం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో కలెక్షన్లు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇదే జోరు కొనసాగితే 'ధురంధర్' త్వరలోనే వెయ్యి కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం ఖాయమని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఈ సినిమాపై అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించడం, మరోవైపు మౌత్ టాక్‌తో ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతుంది.





WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, డిసెంబర్ 23, 2025



# క్రీస్తు బోధనలు మార్గదర్శకం

- చర్చ్ ల లైటింగ్, పెయింటింగ్ లకు రూ.45 లక్షలు కేటాయింపు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓ సీటీలోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్, నియోజక వర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్ లతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం తూర్పు నియోజకవర్గంలోని పాస్టర్ లందరికీ మంత్రి తన సొంత ఖర్చుతో దుస్తులను పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్ధనల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు ప్రేమ, దయ, కరుణలకు చిహ్నంగా నిలుస్తాయన్నారు. క్రిస్మస్ వేడుకలు మత సామరస్యాన్ని చాటుతాయన్నారు. పొరుగువారిని ప్రేమించి వారి తప్పులను క్షమించాలని క్రీస్తు బోధించారన్నారు. ప్రేమ, సహనం, శాంతి, క్షమ ఈ నాలుగు గుణాలే క్రీస్తు చూపిన మార్గాలని, దీనిని అనుసరించడం ద్వారా క్రీస్తు పట్ల మనం చూపే నిజమైన భక్తి అని అన్నారు. ఏసుక్రీస్తు యావత్ మానవాళిని పాపాల నుంచి విముక్తి చేయడానికి శిలువ ఎత్తారని, రక్తాన్ని చిందించి మనుషుల పాపాలను దోషాలను ప్రక్షాళన చేశారని, శాంతి క్షమల సందేశాన్ని తన త్యాగంతో యేసు చాటి చెప్పారని అన్నారు. తన మహిమను ప్రకటించి లోకంలోని పాపాన్ని తొలగించడం కోసం మనుషులకు బదులుగా శిక్షను అనుభవించానని అన్నారు. దేవుడు తాను సృష్టించిన సకల జీవరాశుల్లో వివేకాన్ని జ్ఞానాన్ని ఒక మానవునికి మాత్రమే ఇవ్వడం జరిగిందని అన్నారు. క్రిస్టియన్ మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని, దేశంలో సర్వ మతాలకు రక్షణ కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో కన్నా ఇప్పుడు ప్రత్యేకంగా క్రిస్మస్ సందర్భంగా జిల్లాలోని చర్చ్ ల పెయింటింగ్స్, లైటింగ్ కొరకు ఒక్కో చర్చికి రూ.30 వేల చొప్పున మొత్తం రూ. 45 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాస్టర్లు నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల్లో మంత్రి కొండ సురేఖతోపాటు మేయర్ జిల్లా కలెక్టర్, మాజీ శాసన మండలి సభ్యులు పాల్గొని ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు. తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినంను పురస్కరించుకొని 250 మంది చర్చ్ ఫాదర్ లకు సూట్ లను అందిస్తామని, అందరూ వివాదాలకు తావులేకుండా ఐక్యంగా ఉండాలని, చిన్న చిన్న సమస్యలు వస్తే పరిష్కరిస్తున్నామని, భవిష్యత్ లో అందరికీ అండగా ఉంటామని, క్రీస్తుకు భక్తులకు మధ్య వారధిగా ఫాదర్ లు ఉంటారని వారి ఆశీస్సులు అందరి పైన ఉండాలని అన్నారు. పాస్టర్ ల కోరిన మేరకు స్మశాన వాటికకు రెండు వాహనాలతో పాటు ఫ్రీజర్, మైక్ ను అందజేస్తామని హామీ ఇచ్చారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో అందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమ, కార్పొరేటర్లు భోగి సువర్ణ, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, పోశాల పద్మ, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, ఫుర్ఖాన్, ఫాస్టర్లు, క్రైస్తవ సోదర సోదరిమణులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

☐ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన నడికుడ మండలం పులిగిల్ల, వరికోల్, నర్సక్కపల్లి గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు మంగళవారం హనుమకొండలోని ధర్మారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి పూల బొకే అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికలవరకే పార్టీలని, తర్వాత పాలకవర్గ సభ్యులందరూ కలిసికట్టుగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. మీపై ప్రాజల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆకట్టుకున్న ప్రీ క్రిస్మస్ వేడుక

వరంగల్ శివనగర్ ఏకశిల స్కూల్‌లో మంగళవారం జరిగిన ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఆరో తరగతి విద్యార్థులు తమ నృత్యంతో ఆకట్టుకున్నారు. బత్తుల జ్ఞానశ్రీ పటేల్, లిఖిత, మౌనిక, ఆరోహి, అనన్య బృంద ప్రీ క్రిస్మస్ నృత్యంతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం బేతి కొండల్‌రెడ్డి, టీచర్లు స్వప్న, స్వప్నలతలు అభినందించారు. –వరంగల్ వాయిస్, శివనగర్

# సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

**ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించినప్పుడే రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం నీడిగొండలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గారితో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ కొత్త రకం విత్తనాలు, వ్యవసాయ పనిమొట్లు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ..... పత్తి సాగు, ఉత్పత్తి పెంచడానికి రైతులు, శాస్త్రవేత్తలతో కలిసి ఏర్పాటు చేసిన కిసాన్ మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రతీ సంవత్సరం ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నప్పటికి ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదని అన్నారు. పత్తిలో అధిక సాంధ్రత పాటిస్తే ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్న సలహాలను రైతులు పాటించాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. వ్యవసాయానికి సంబంధించి సబ్సిడీలు బోనస్లు ఉచిత విద్యుత్ రైతు భరోసా వంటి పథకాలతో ఏడాదిలో ఒక ఎకరానికి 20,000 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులను సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఉయ్యాలవాడ కింగ్ మేకర్ 'హనుమ'

- ఒంటి చేతితో గెలిపించిన దురంధరుడు
- సాఫీగా సజావుగా సాగిన సర్పంచ్ ఎన్నికలు
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సర్పంచ్ ఎన్నికలు ముగిసాయి. నూతన పాలక వర్గం కొలువుదీరింది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక గ్రామమైన ఉయ్యాలవాడ ఈ సారి ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావివ్వకుండా రికార్డు సృష్టించింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా ఇద్దరు పోటీపడగా ఈ ప్రాంత నాయకుడు తాళ్లూరి హనుమంతు రావు బలపర్చిన వ్యక్తి శ్యాం బాబు అత్యధిక మెజార్టీతో విజయం సాధించి బాధ్యతలు చేపట్టారు. డోర్నకల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీలో 19 గ్రామపంచాయతీ స్థానాలు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలుపొందగా నాలుగు స్థానాల్లో బీఆర్ఎస్ ఒక స్థానంలో సీపీఎం బలపరిచిన అభ్యర్థులు గెలుపొందారు. ఇందులో చిల్కోడుతో పాటు ఉయ్యాలవాడ గ్రామంలో జరిగిన ఎన్నికలు టెన్షన్ వాతావరణాన్ని కల్పించాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో అంటూ వారం రోజులుగా పోలీసులు, విలేకరులతో పాటు వివిధ గ్రామాల ప్రజలు, పార్టీల నాయకులు ఆతృతగా పరిశీలించారు. ఉయ్యాలవాడ గ్రామంలో డీఎస్పీ స్థాయి అధికారి వచ్చి ఇక్కడే మకాం వేసి ఎన్నికల ముగిసే వరకు బందోబస్తు నిర్వహించారంటే గ్రామంలో ఎలాంటి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

## కింగ్ మేకర్..

ఇదిలావుండగా ఉయ్యాలవాడ గ్రామాన్ని ఎస్టీ రిజర్వ్ కాగా గ్రామ పరిధిలోని సత్య తండా నుంచి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బానోత్ శ్యాంబాబు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి బానోత్ ఉపేందర్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు శ్యాంబాబు గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి హనుమంతు అన్నీ తానై అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. ముఖ్యంగా గ్రామాల వివిధ కులమతాలు, వర్గాల ప్రజల నుంచి సత్సంబంధాలు కలిగిన హనుమ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రమైన కృషి చేశారు. ఇక్కడి ప్రజలకు అవసరమైన అన్ని పనులను చకాచగా చేసుకోవడంతో పాటు వారికి పెన్షన్, ఇందిరమ్మ గృహాలు, ప్రమాదాలకు గురైతే ఇన్సూరెన్స్ సౌకర్యం అందిచటం, ఎమ్మెల్యే రామచంద్రనాయక్ తోటి నిత్యం టచ్ లో ఉంటూ ప్రజల అవసరాలను తీర్చడం





గమనించిన ప్రజలు హనుమ మాటకు విలువ ఇచ్చారు. తాళ్లూరి హనుమ బలపరిచిన అభ్యర్థి శ్యాంబాబు కు 476 ఓట్ల భారీ మెజార్టీతో గెలపొందారు. ఇంతే కాకుండా పోలీసుల సూచనలను పాటిస్తూ జిల్లాలోనే అత్యంత సమస్యాత్మక గ్రామంగా ఉన్న ఉయ్యాలవాడ లో నేడు ఎటువంటి చిన్న గొడవలు కూడా తావు లేకుండా ఎన్నికలు సజావుగా కొనసాగాయి.. ముగిశాయి. ఇటు ఎమ్మెల్యే రామచంద్రనాయక్ తో పాటు గ్రామ,మండల ప్రజలు తో పాటు కాంగ్రెస్ నాయకుల అభిమానాలు అందుకున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com